క్లుప్తంగా

వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



విశేష అలంకరణలో స్వామివారు

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాఘమాసం తొలి శనివారం కావటంతో వేలాదిమంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే స్వామివారిని దర్శించుకున్నారు. వందలాది మంది భక్తులు రావడంతో స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అలాగే అన్న సమారాధన ఏర్పాటుచేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి శనివారం భక్తులకు దాతల సహకారంతో ఉచిత అన్న సమారాధన నిర్వహిస్తున్నామని, అలాగే ప్రసాదాలు కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా జీఎస్ రావు జన్మదిన వేడుకలు



జీఎస్ రావు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న పార్టీ శ్రేణులు

నిడదవోలు: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, మాజీ పీసీసీ అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నాయకులు జీఎస్ రావు జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, పార్టీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, నిడదవోలు, పెరవలి ఎంపీపీలు పెరుమళ్ల భాగ్యలక్ష్మి, కార్చర్ల ప్రసాద్, పార్టీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగన పొలయ్య, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



పట్టణంలో ఫాగింగ్ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

నిడదవోలు: పట్టణంలో దోమల నివారణకు శనివారం మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. గత నెల 29న జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో పట్టణంలో విపరీతంగా పెరిగిపోతున్న దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సభ్యులు మూకుమ్మడిగా అధికారులపై మండిపడ్డారు. దీంతో స్పందించిన అధికారులు దోమల నివారణకు ఫాగింగ్, లార్వా పెరగకుండా కాలువల్లో మందు స్ప్రే చేశారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆదేశాల మేరకు మున్సిపల్ ఇన్‌చార్జి శానిటరి ఇన్‌స్పెక్టర్ గెంజి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో పట్టణంలో ఎస్టీ కాలనీ, బసివిరెడ్డిపేట, గణేష్‌చౌక్ సెంటర్, గణపతి సెంటర్ ప్రాంతాల్లో రెండు మెషీన్లతో ఫాగింగ్ చేశారు.

కుంభమేళాకు రెండు ఆర్టీసీ సర్వీసులు

కొవ్వూరు: ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న మహా కుంభ మేళాకు కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి బయలుదేరిన రెండు ఆర్టీసీ బస్సులు శనివారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. కొవ్వూరు పరిసర ప్రాంత వాసుల సౌలభ్యం కోసం తక్కువ ఖర్చుతో ప్రయాగ్‌రాజ్ కుంభ మేళాకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. పుష్ బ్యాక్ బస్సు, స్లీపర్ బస్సు బయలుదేరి వెళ్లినట్లు డిపో మేనేజర్ వైవీవీ ఎస్.కుమార్ తెలిపారు. వారం రోజులు పాటు ఈ యాత్ర కొనసాగుతుందని, ఈ నెల ఎనిమిదో తేదీన తిరిగి కొవ్వూరు వస్తాయన్నారు. ప్రయాణికులకు అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం అందిస్తామని డీఎం తెలిపారు. వీటితో పాటు భక్తులకు ఓఆర్ఎస్ఎల్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 14వ తేదీన రెండు స్లీపర్ బస్సులు, ఒక పుష్ బ్యాక్ సూపర్ లగ్జరీ మొత్తం మూడు బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పెరవలిలో 94.63 శాతం పింఛన్ల పంపిణీ



పెరవలిలో పింఛను అందజేస్తున్న ఎంపీడీఓ వెంకట రమణ

పెరవలి: మండలంలో శనివారం పింఛను పంపిణీ 94.63 శాతం జరిగిందని ఎంపీడీఓ సీహెచ్ వెంకట రమణ తెలిపారు. అధికారులు తెల్లవారు జాము నుండే పంపిణీని ప్రారంభించారు. పింఛనుదారులు 10217 మంది ఉండగా వీరిలో 9663 మందికి సొమ్ములు అందజేశారు

సాగునీటి గండం

- డైరెక్ట్ పైపుల నుంచి అందని సాగునీరు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పెరుగుతున్న ఖర్చులు

పెరవలి: ప్రధాన కాలువలకు నీటిగండాలు తప్పడంలేదు. వీటి నుంచి విడిపోయిన చిన్న, పిల్ల కాలువలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కాలువ నుంచి వచ్చే డైరెక్ట్ పైపుల(డీపీ) పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఈ కాలువల గురించి పట్టించుకునే నాథులే కరువయ్యారు. దీంతో అధికారులు ఈ కాలువలు తవ్వడానికి నిబంధనలు అడ్డంకిగా మారడంతో వీటిపై ఆధారపడిన పంట భూములు తీవ్ర అవస్థలు పడుతున్నాయి. పెరవలి మండలంలో నిడదవోలు–నర్సాపురం, బ్యాంక్ కెనాల్‌లు ప్రధాన కాలువలు కాగా వీటి నుంచి డైరెక్ట్ పైపులు 39 ఉన్నాయి. ప్రధాన కాలువలకు 7 వేల క్యూసెక్కులు నీరు వస్తే ఈ కాలువలకు నీరు సక్రమంగా అందుతుంది. కానీ ప్రధాన కాలువకు ప్రస్తుతం 4 వేల క్యూసెక్కుల నీటిని వదలడంతో ఈ కాలువలకు నీరు అందడం లేదు. ఈ డైరెక్టు పైపులపై 5,600 ఎకరాల పంట భూముల సాగు జరుగుతోంది. కాలువకు పూర్తి స్థాయిలో నీరు అందినప్పుడు ఈ పైపుల నుంచి నీరు కూడా పుష్కలంగా లభిస్తుంది. ప్రస్తుతం ప్రధాన కాలువలకే తీవ్ర నీటి ఎద్దడి ఉండడంతో ఈ పైపులకు నీరు ఎక్కకపోవడంతో వీటిపై ఆధారపడిన పంట భూములు నీటి కోసం నోర్లు వెళ్లదీస్తున్నాయి. దాళ్వాకు నీటి ఎద్దడి ఉండదని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటనలు గుప్పించడంతో ఎన్నో ఆశలతో సాగు చేపట్టిన రైతులకు ప్రస్తుతం నీటి కోసం కటకటలాడిపోతున్నారు.

పెరవలి మండలంలో తీపర్రు, ఉసులుమర్రు, కాకరపర్రు, ముక్కామల, అజ్జరం, కాపవరం, మల్లేశ్వరం, ఖండవల్లి గ్రామాల వద్ద ఈ డైరెక్ట్ పైపులు ఉండగా వీటికీ కూడా సక్రమంగా నీరు అందడం లేదు. గత దశాబ్ద కాలంగా ఈ పైపులకు మరమ్మతులు జరగకపోవడంతో ఎక్కడికక్కడ పూడుకుపోవడం, కొన్ని గట్లు ఆక్రమణలకు గురవ్వడంతో ఈ కాలువలలో నీరు అంతంతమాత్రంగానే ప్రవాహం జరుగుతోంది. ఇరిగేషన్ అధికారులకు ఈ డైరెక్ట్ పైపులపై ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడం, కాలువలు తవ్వడానికి ఇరిగేషన్ రికార్డుల్లో కాలువలుగా వీటిని గుర్తించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. కేవలం నీటిని వదలడం వరకే చేయడంతో ఈ పైపులపై ఆధారపడిన రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రధాన కాలువల్లో నీరులేక..



డైరెక్టు పైపుల ద్వారా సాగు నీరు అందాల్సి ఉంది. ప్రధాన కాలువల్లో నీరు పుష్కలంగా లేకపోవడంతో ఈ డైరెక్టు పైపులకు ఎక్కడం లేదు. దీంతో నీటి కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇప్పటికే ఇంజిన్లు పెట్టి నీటిని తోడుకుంటున్నాం. పంట పూర్తి అయ్యేటప్పటికి ఖర్చు తడిసిమోపుడ య్యేలా ఉంది.

–కొమ్మన గంగరాజు, కౌలురైతు, పెరవలి

పేరుకే కాలువలు



చేలకు నీరు అందడం లేదు, పేరుకే కాలువలు కానీ నీరు రావడంలేదు, వచ్చే నీరు అడుగండడంతో ఇంజిన్ల సాయంతో నీరు తోడుకోవాల్సి వస్తోంది. ఇటువంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదు. దాళ్వా వద్దంటే మానివేసే వాళ్లం ఇప్పుడు నీరు పెట్టలేక పంటను వదులుకోలేక నలిగిపోతున్నాం.

–మద్దిపాటి సత్యం, రైతు, ముక్కామల

వంతుల వారీగా అందిస్తున్నాం



ప్రధాన కాలువకు ప్రస్తుతం 4 వేల క్యూసెక్కుల నీరు వస్తోంది, రైతులందరికీ సాగునీరు సక్రమంగా ఇవ్వాలనే ఉద్దేశంతో వంతుల వారీ విధానం ప్రవేశపెట్టాం, ప్రస్తుతం బ్యాంకు కెనాల్‌పై మొదటి వంతు అందిస్తున్నాం. అందరీ సాగునీరు అందించే ప్రయత్నం చేస్తున్నాం.

–ఎ.బాల మురళీకృష్ణ, ఇరిగేషన్ ఏఈ, పెరవలి



ముక్కామల వద్ద డైరెక్టు పైప్‌లో అంతంత మాత్రంగా ఉన్న నీరు



పెరవలిలో నీరు రాని డైరెక్టు పైప్



ఉసులుమర్రులో మురుగుబోదెలో నీరు తోడుకుంటున్న రైతులు

ప్రభుత్వ పాఠశాలల్లో రోల్ వెరిఫికేషన్



దూబచర్ల జెడ్పీ హైస్కూల్లో విద్యార్థుల నమోదును పరిశీలిస్తున్న ఎంఈఓ-2

నల్లజర్ల: రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల రీస్ట్రెక్చర్ ఆర్గనైజేషన్ చేస్తున్న దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పది తరగతుల వరకు రోల్ వెరిఫికేషన్ కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభమైంది. 2024 డిసెంబరు 31వ తేదీ నాటికి ఆయా పాఠశాలల్లో ఎంత మంది విద్యార్థులు నమోదై ఉన్నారు. ఎంతమంది బడికి హాజరవుతున్నారన్న విషయాలను ఈ వెరిఫికేషన్ ద్వారా తెలుసుకోనున్నారు. పేర్లు ప్రభుత్వ పాఠశాలలోను, చదువు ప్రైవేటు పాఠశాలల్లో ఉంటున్నాయి? అనే విషయాలను పరిశీలించనున్నారు. స్థానికంగా ఉపాధ్యాయ పోస్టులను నిలుపుకొనే ప్రయత్నంలో తప్పుడు రోల్ ఎక్కడైనా నమోదైందా అన్న విషయాలను పరిశీలన అనంతరం నివేదికలను ఉన్నతాధికారులకు అందించనున్నారు. ఎంఈఓ-1 వై.సత్యనారాయణ, సీఆర్పీ శ్రీను పోతవరం కాంప్లెక్స్, ఎంఈఓ–2 భగవతి, సీఆర్పీ పెద్దులు దూడచర్ల కాంప్లెక్స్ పరిధిలో పరిశీలన చేయగా మార్కెల్లమూడిలో ఎంపీడీఓ సింహాద్రి రోల్ వెరిఫికేషన్ చేశారు. మండల ప్రత్యేక అధికారి కృష్ణారావు కూడా ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టరు ఆకస్మిక తనిఖీ చేయవచ్చు. సోమవారం కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని ఎంఈఓ వై.సత్యనారాయణ తెలిపారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు

- అధికారులపై రైతుల ఆగ్రహం
- అవసరానికి సరిపడా అందుబాటులో లేని ఎరువు
- యర్నగూడెం సొసైటీ వద్ద గందరగోళం



యర్నగూడెం సొసైటీ వద్ద ఎరువుల కోసం ఎగబడుతున్న రైతులు

దేవరపల్లి: వరి పంట వేసిన రైతులు యూరియా ఎరువు కోసం పడిగాపులు పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సొసైటీల వద్ద రైతులు యూరియా కోసం నిరీక్షిస్తున్నారు. వరి పంటకు ప్రధాన ఎరువుగా రైతులు దాళ్వాలో యూరియా వాడాల్సి ఉంది. ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా ధర ఎక్కువగా ఉండడంతో సొసైటీలపై రైతులు ఆధారపడి ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బస్తా యూరియా రూ.270 విక్రయించాల్సిన ఉంది. ఖర్చులతో కలిపి రూ.290లకు సొసైటీలు రైతులకు ఎరువులు సరఫరా చేస్తున్నాయి. ప్రైవేటు డీలర్లు బస్తా రూ.350 నుంచి రూ.400 వసూలు చేస్తున్నట్టు రైతులు వాపోతున్నారు. దాళ్వా పంటకు 3 నుంచి 5 దఫాలుగా యూరియా వేస్తున్నారు. మూడు దఫాలకు ఎకరాకు 3 బస్తాలు వాడాల్సి ఉండగా, ఐదు దఫాలుగా ఐదు బస్తాలు వాడుతున్నారని అధికారులు అంటున్నారు. మండలంలోని యర్నగూడెం సొసైటీ వద్ద యూరియా కోసం శనివారం రైతులు పడిగాపులు కాసారు. రైతులకు అవసరానికి తగినంతగా సిబ్బంది యూరియా ఇవ్వకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కొరత ఉన్నప్పటికీ అధికారులు లేదని చెప్పడం విడ్డూరంగా ఉందని రైతులు అంటున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి కె.విజయ్‌ని వివరణ కోరగా సొసైటీ వద్ద ప్రస్తుతం 20 టన్నుల యూరియా ఉందని, రెండు రోజుల్లో మరొక 25 టన్నులు వస్తోందని ఆయన తెలిపారు. అవసరానికి మించి పంటకు యూరియా వాడుతున్నారని ఆయన తెలిపారు. సాధారణంగా ఎకరాకు మూడు దఫాలుగా మూడు బస్తాల యూరియా వాడితే సరిపోతుందన్నారు. అయితే ఐదు దఫాల్లో ఐదు బస్తాల వాడుతున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం మూడో దఫా ఎరువును వేస్తున్నారని, మరొక 10 రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందన్నారు. మండలంలో యర్నగూడెం, చిన్నాయగూడెం, దేవరపల్లి, గౌరీపట్నం సొసైటీల వద్ద యూరియా అందుబాటులో ఉందన్నారు. ప్రైవేటు డీలర్ల వద్ద కూడా యూరియా అందుబాటులో ఉంచినట్టు ఆయన తెలిపారు. వరి రైతులకు మాత్రమే యూరియా పంపిణీ చేయాలని సొసైటీ అధికారులకు సూచించినట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. యర్నగూడెం సొసైటీ పరిధిలో వరి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉందని, 75 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు మార్క్‌ఫెడ్‌కు ఇండెంట్ పంపగా, ప్రస్తుతం 25 టన్నులు సరఫరా చేసినట్టు ఆయన తెలిపారు. రైతుకు 5 బస్తాల చొప్పున పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు.

తలారిని కలిసిన రమేష్‌బాబు



తలారి వెంకట్రావును కలిసిన జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన కంఠమణి రమేష్ బాబు శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రమేష్‌బాబుని వెంకట్రావు అభినందించారు. రానున్న రోజుల్లో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, పార్టీలో యువత ప్రాధాన్యతను పెంచేందుకు ప్రయత్నించాలని సూచించారు. చిట్టూరి అన్న వరం, కొడవటి దేవా, రాజాన శివ, బంగారయ్య, మజ్జి శ్రీనివాస్ తదితరులు కలిసి వారిలో ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు రంగులు



దేవరపల్లి ఇందిరమ్మ కాలనీలో మరమ్మతులు చేసిన అంగన్‌వాడీ కేంద్రం

దేవరపల్లి: దేవరపల్లిలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతులు పూర్తి చేసినట్టు పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికిషోర్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలను మరమ్మతులు చేసి, రంగులు వేసినట్టు ఆయన వివరించారు. ఒక్కో కేంద్రానికి ప్రభుత్వం రూ.9,500 మంజూరు చేసినట్టు ఆయన వివరించారు. కేంద్రాల వద్ద ఆహ్లాదకర వాతావరం ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. కేంద్రాల వద్ద టాయిలెట్లు, మంచి నీటి శుద్ధి పరికరాలను ఏర్పాటు చేసినట్టు ఆయన వివరించారు. కేంద్రాలను శనివారం సర్పంచ్ కడిమి వీరకుమారి, కార్యదర్శి రవికిషోర్ పరిశీలించారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



కొండాయిగుంటలో దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు తదితరులు

నల్లజర్ల: ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు సూచించారు. సింగరాజుపాలెం, కొండాయిగుంట గ్రామాల్లో శనివారం ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం ద్వారా దోమకాటు నుంచి రక్షణ పొందవచ్చునని, ఆరోగ్య నియమాలు పాటించి ఆరోగ్య భద్రత పొందవచ్చునని, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇళ్లలో ఉన్న నీటి తొట్టెలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటే లార్వా దశలోనే గుడ్లను నిర్మూలించి దోమల ఉధృతి లేకుండా చేసుకోవాలన్నారు. ఏఎన్ఎం,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు



ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అప్పారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే, లయన్స్‌క్లబ్ సభ్యులు

చాగల్లు: ఉద్యోగంలో బాధ్యత, అంకితభావంతో పని చేస్తే తగిన గుర్తింపు లభిస్తుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కొవ్వూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎస్ అప్పారావు పదవీ విరమణ కార్యక్రమం శనివారం నెలటూరు సీతారామ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ లో వివిధ విభాగాల్లో పదోన్నతి పొందిన అప్పారావు సొంత నియోజకవర్గంలో ఉద్యోగ విరమణ పొందడం హర్షణీయమన్నారు. అనంతరం పలువురు నాయకులు అప్పారావును దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. లయన్స్‌క్లబ్ సభ్యులు అప్పారావును సత్కరించి నిలువెత్తు చిత్రపటం బహూకరించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మున్సిపల్ కౌన్సిలర్ సురపనేని చిన్ని, తెలుగుదేశం పార్టీ శ్రేణులు నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, సూర్యదేవర రంజిత్, బొడ్డు కేశవ, ఇడుపుగంట మురళి, తెదేపా నెలటూరు గ్రామ ప్రెసిడెంట్ తాళ్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ అంకెల గారడీ

కొవ్వూరు: కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడీలా ఉందని, రాష్ట్ర ప్రయోజనాలను విడిచిపెట్టిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఎండీ ఫాసీ ఉల్లాబేగ్ ఆరోపించారు. ఈనెల ఐదో తేదీన ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలుంటే ఒకటో తేదీన హడావిడిగా బడ్జెట్ ప్రవేశ పెట్టడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కేవలం ఢిల్లీ, రానున్న బీహార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌లో కేటాయింపులు చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తుని 45 మీటర్లు నుంచి 41.15 మీటర్లు తగ్గించడం సమజసం కాదన్నారు. కేవలం రూ.500 కోట్లు మాత్రమే పోలవరం ప్రాజెక్టుకి కేటాయిస్తే ఎప్పటిలోగా ప్రాజెక్టును పూర్తి చేస్తారని ప్రశ్నించారు.

బడ్జెట్ ప్రజామోదమైంది

నల్లజర్ల: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజామోదమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి పల్లి నాగరాజు అన్నారు. పోలవరం అభివృద్ధికి రూ.12 వేలకోట్లు, సమగ్ర అభివృద్ధి, ప్రైవేటు రంగ పెట్టుబడులకు , కుటుంబ మనోభావాలను పెంచడం దేశంలో పెరుగుతున్న మధ్యతరగతి వ్యయశక్తిని పెంపొందించడం వెనుకబడిన జిల్లాల్లో దన్‌ధాన్య యోజనతో వ్యవసాయానికి పెద్దపీట వేసినట్టు చెప్పారు. కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితి రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు పెంపు మహిళలకు పది కీలక రంగాలపై త్వరిత సమ్మిళిత అభివృద్ధి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా బడ్జెట్ ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వృద్ధి మందగించినా భారత్ మెరుగైన పనితీరు సాధించిందన్నారు. రాబోయే రోజుల్లో శాసించే స్థాయికి ఎదుగుతుందన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ పరిశీలన



డ్రైనేజీని పరిశీలిస్తున్న సర్పంచ్ వీరకుమారి, పంచాయతీ అధికారులు

దేవరపల్లి: గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థను శనివారం స్థానిక సర్పంచ్ కడిమి వీరకుమారి, కార్యదర్శి ఎస్.రవికిషోర్, సిబ్బంది పరిశీలించారు. 'పరిశుభ్రత కనువరుగు' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామంలో పర్యటించి డ్రైనేజీలను పరిశీలించారు. సీబీఎస్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెసుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మించాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను తొలగించి ఒపెన్ డ్రైనేజీ నిర్మించాలని ప్రజలు కోరారు. దోమల బెడద ఎక్కువగా ఉందని, నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు మొరపెట్టుకున్నారు. దీనిపై సర్పంచ్ కడిమి వీరకుమారి, కార్యదర్శి రవికిషోర్ మాట్లాడుతూ రెండు రోజుల్లో గ్రామంలో ఇంటింటా దోమల నివారణకు ఫాగింగ్ చేస్తామని, డ్రైనేజీల్లో మిలాథిన్ మందు పిచికారీ చేసి దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సాక్షి ఇంపాక్ట్

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో కుట్టు, మగ్గం, కంప్యూటర్లలో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుట్టు, మగ్గం శిక్షణకు కనీసం ఏడో తరగతి చదివి ఉండాలని, కంప్యూటర్ నేర్చుకోవాలనుకునే వారికి ఇంటర్మీడియెట్ అర్హత అన్నారు. 45 రోజుల పాటు జరిగే శిక్షణలో ఉచితంగా మెటీరియల్, మధ్యాహ్నం భోజనం అందజేసి, నైపుణ్యం గల ఉపాధ్యాయులతో శిక్షణ అందిస్తామన్నారు. ఆసక్తి కలవారు 98498 47489 ఫోన్ నంబర్‌ను, లేదా లాలాచెరువులోని స్వర్ణాంధ్ర సేవాసంస్థను సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



న్యాయవాదులకు పోస్టర్లు పంపిణీ చేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి రాజబాబు

సీటీఆర్ఐ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తనను గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల స్వతంత్ర అభ్యర్థి శెట్టిబత్తుల రాజబాబు అన్నారు. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరం కోర్టు ప్రాంగణంలో శనివారం పలువురు న్యాయవాదులను కలిసి, తనకు మద్దతు తెలిపాలని అభ్యర్థించారు. తొలుత రాజమండ్రి బార్ అసోసియేషన్ కార్యదర్శి పెల్లూరి రమేష్‌కు పోస్టర్ అందజేశారు. రాజబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తొంగలో తొక్కిందన్నారు. అధికారంలోకి రావడానికి అనేక అబద్ధపు హామీలు ఇచ్చారన్నారు. ఇప్పుడు పట్టభద్రుల ఎమ్మెల్సీ విషయంలో కూడా అనేక ప్రలోభాలకు పాల్పడుతున్నారని తెలిపారు. విజ్ఞత కలిగిన మేధావులు ఆలోచించి.. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో తనకు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో న్యాయవాదులు ఇసుకపట్ల రాంబాబు, తప్పెట్ల పృథ్వీరాజ్, కొల్లాపు వేణు, ఏ.ఆనంద్ కుమార్, వై.భవాని, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.